www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 నవంబర్ 2023

5

తూర్పుగోదావరి

బాణసంచా దుకాణాల స్థలం పరిశీలన

ప్రజాశక్తి - గోకవరం

మండల కేంద్రమైన గోకవరం సంత మార్కెట్ వద్ద దీపావళికి బాణా సంచా అమ్మక స్థలాన్ని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, అగ్ని మాపక అధికారి ఆర్.గోవిందు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని దీపావళి సామాన్లు అమ్మకాల షాపులకు సంత మార్కెట్ అనువుగా ఉంటుందని, ఎవరికీ ఎటువంటి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా సంత మార్కెట్ ఉంటుందని తెలిపారు. ఈ పరిశీలనలో వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, పులపర్తి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

రూ.కోట్లు వెచ్చించినా తప్పని వెత..

- అయినా నగర ప్రజలకు తప్పని చింత
- చిన్నపాటి వర్షానికే ముంపు బారిన నగరం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం. రాష్ట్రంలోనే ప్రముఖ వాణిజ్య రాజధానిగా పేరెన్నిక గన్నది. ఇలా గతమెంతో ఘనకీర్తిని చాటుకున్న రాజమహేంద్రవరం నగరం నేటి పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ముంపు నగరంగా మారిపోతోంది. నగరంలో చినుకు పడితే చిత్తడే చిత్తడి అన్నట్లుగా పరిస్థితులు నెలకుంటున్నాయి. కోట్లాది రూపాయలతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని జబ్బలు చరుచుకుంటున్న పాలకుల అభివద్ధి అంతా నగరంలో ఏ కూడళ్లలో చూసిన వారు వేయించుకున్న ఫ్లెక్సిలలోనే కన్పిస్తోంది.

శనివారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికే శ్యామలా సెంటర్లో నిలిచిపోయిన వర్షం నీరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గత నాలుగేళ్లన్నరేళ్లగా సుందర నగరంగా తీర్చుదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులకు నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు, డ్రయిన్లు సమానంగా నీటి ప్రవాహం జరుగుతున్న తీరు మాత్రం కన్పించడం లేదు. వేసిన రోడ్లపైనే డబుల్ రోడ్లు వేస్తు, నిర్మించి రెండు సంవత్సరాలు కాకముందే దాని స్థానంలో మరో మురికి కాలువలను నిర్మిస్తున్నారే తప్ప పలుచోట్ల ఏళ్ల తరబడి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కనీస పట్టింపు లేకుండా ఉండడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన రహదారులను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తున్నామంటూ చెప్పుకునే నాయకులు ఆయా వార్డుల్లో సంవత్సరాల తరబడి కనీస రోడ్లు లేక, చిన్నపాటి వర్షం పడితే మురికినీరు ఇళ్ల ముందు వచ్చి చేరి రోగాల పాలవుతున్నారు. తమ గోడు పట్టించుకోండని వేడుకుంటున్నా అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. సాక్షాత్తు ఎంపి మార్గాని భరత్ రామ్ వార్డుల్లో పర్యటించిన సమస్యలు పరిష్కారానికి అధికార యంత్రాంగం చొరవ చూపించడం లేదు. కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులపై డివైడర్లు, పార్కుల అభివృద్ధికి మాత్రమే పరిమితమవుతున్నారు. ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదు.

చినుకుపడితే చిత్తడే..

చిన్నపాటి చినుకు పడితే చాలు రాజమహేంద్రవరంలోని అనేక వార్డుల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. రోడ్ల వెంబడి గుంతలు, వర్షపు నీరు ప్రవహించేందుకు మురికి కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి రోడ్లవెంట ప్రయణించాలంటేనే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షాలు కురుస్తేనే రోడ్ల వెంట ఉన్న గుంతల్లో నీరు చేరి మడుగులు కడుతున్నాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లు మాత్రం అందంగా తీర్చిదిద్దిన అధికారులు తీవ్రంగా సమస్య ఉన్న పలు కాలనీల్లో మాత్రం రోడ్లు వేయకపోవడం, గుంతలు పడ్డచోట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. కంబాల చెరువు వద్ద పేరుకపోయిన మట్టిని, చెత్తను పూర్తిస్థాయిలో తీయకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై పారుతోంది. పేపర్ మిల్లు మొదలుకుని ఆర్యాపురం వరకు చిన్నపాటి వర్షాలకి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే లలిత నగర్, హుకుంపేట, బాలాజీ నగర్, తదితర ప్రాంతాల్లోనూ మురుగునీరు దాటికి తీవ్ర దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు అవస్థలు పడ్డారు.

అభివృద్ధి పేరుతో రూ.కోట్ల ఖర్చు

రాజమహేంద్రవరంలో అభివృద్ధి పేరుతో వందల కోట్లు ఇటీవల కాలంలో వెచ్చించారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కంబాల చెరువు పార్క్ ప్రారంభోత్సవం సందర్భంగా నగరాభివృద్ధిని కీర్తించిన విషయం విదితమే. నగరంలో సెంటర్ జైలు రోడ్డు, ఎవి అప్పారావు రోడ్డు, జెఎన్ రోడ్లలో మాత్రమే కొంతమేర అభివృద్ధి పరిమితమైంది. అనేకచోట్ల రహదారులు విస్తరించకుండా డివైడర్లు ఏర్పాటు చేశారు. పెరుగుతున్న రద్దీ తగినట్లుగా రహదారులు లేకపోవడం, డివైడర్లు ఏర్పాటు చేయడంతో బస్ కాంప్లెక్స్ ఏరియా, ఎవి అప్పారావు రోడ్లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధాన వీధుల్లో ఒకటైన శ్యామల నగర్, స్టేడియం రోడ్డు ప్రధాన రైల్వే స్టేషన్ ఏరియా, బస్ కాంప్లెక్స్, కంబాల చెరువు, లలిత నగర్లలో మురికి కాల్వల ఆధునీకరణకు నోచుకోవడం లేదు. అయినా ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఇలా అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్, ఇతర నాయకులు

6న రాజమహేంద్రవరంలో ...

ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

-జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 6న రాజమహేంద్రవరంలో జరుగుతున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 30న శ్రీకాకుళంలో ప్రారంభమైన సిపిఎంప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర నవంబర్ 6 సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని కోటిపల్లి బస్టాండ్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో సిపిఎం రాష్ట్ర నాయకత్వం మంతెన సీతారాం, వి.ఉమామహేశ్వరరావు, ఎవి.నాగ్రశ్వరరావు, కె.ధనలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల నెత్తిన భారాలు, కార్పొరేట్లకు లాభాలు వచ్చేలా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థలు లాభాలను గడిస్తుంటే, మధ్య చిన్నతరహా పరిశ్రమలు మూతపడి కోట్లాదిమంది కార్మికులు వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఊసే లేకుండాచ చేశారని ధ్వజమెత్తారు. దేశంలోని వివిధ ప్రభుత్వ శాకల్లో సుమారు 14 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సివుందన్నారు. రైతాంగం తీవ్ర సంక్షేపంలో ఉందని, రైతులు, వ్యవసాయ కూలీలు వలసలు పోవాల్సిన దుస్థితి ఈ పాలనలో ఏర్పడిందని విమర్శంచారు. అటువంటి ప్రభుత్వాన్ని సాగనంపడం తప్ప ప్రజలకు వేరే మార్గం లేదని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోడీ బాటలోనే నడుస్తుందని, సంక్షేమం పేరుతో అభివృద్ధి మాట మరిచారని అన్నారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షలకుపైగా ఉన్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, ప్రభుత్వ పథకాలు, అమలు చేయకుండా వారితో వెట్టి చాకిరి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు తిట్టుకోవడానికి, బూతు పురాణాలు మాట్లాడుకోవడానికి చట్టసభలను, రాజకీయాలను పరిమితం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు 30 రకాల సమస్యలను ప్రజా మేనిఫెస్టోగా ప్రజల ముందు ఉంచి, వాటిని ప్రజలు, రాజకీయ పార్టీలు చర్చించేలా చేసేందుకు సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను ప్రారంభించిందని, యాత్ర సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగే బహిరంగ సభలో తూర్పుగోదావరి జిల్లాలోని కార్మికులు, రైతులు మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల.రాంబాబు, ఎం.సుందర బాబు, వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - గోపాలపురం, కడియం

గోపాలపురం మండలంలోని సగ్గొండ గ్రామంలో జరిగిన జెఎఎస్ శిబిరంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని వెంకట్రావు అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకే జెఎఎస్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పి.లలిత, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వైసిపి నాయకులు వై.కవిత, పి.నాగరాజు, ఖాదర్ వలీ, ఎంపిటిసి సభ్యురాలు ఎం.రాజేష్, తదితరులు పాల్గొన్నారు. **కడియం** మండలంలోని కడియపుసావరంలో జెఎఎస్ కార్యక్రమాన్ని జెసిఎస్ అధ్యక్షులు తాడాల విష్ణు చక్రవర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుజాత, ఇఒపిఆర్డి డి.వెంకటలక్ష్మి, ఎంపిటిసి ఎస్.దుర్గ, కార్యదర్శి విజయరాజు, మాజీ సర్పంచ్ ఎస్.సూరిబాబు, ఎస్.కామేష్, పి.పెద్దకాపు పాల్గొన్నారు.

రోజుకో కేసు పెట్టడమే లక్ష్యంగా జగన్ పాలన

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి అధినేత చంద్రబాబుపై రోజుకో కేసు పెట్టడమే లక్ష్యంగా జగన్ రెడ్డి పాలన సాగుతుందని టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బట్టు దేవకృష్ణ ఆరోపించారు. బొబ్బిల్లంకలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవకృష్ణ మాట్లాడారు. అక్రమ కేసులో 52 రోజులపాటు జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన రోజునే చంద్రబాబుపై మద్యం కేసు పెట్టిన జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించినా తప్పుపడుతూ మరో కేసు పెట్టడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శంచారు. మద్యాన్ని నిషేధిస్తానని అధికారంలోకి వచ్చి నేడు ఎందరో ఆ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయేలా వైసిపి ప్రభుత్వ పాలన సాగుతుందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా 2024 ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావడం ఖాయమన్నారు.

మహిళల కోసమే మహాశక్తి

ప్రజాశక్తి - గోకవరం

రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే టిడిపి అధినేత చంద్రబాబు మహాశక్తి పథకాన్ని ప్రకటించారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్విఎస్ అప్పలరాజు, మాజీ జడ్పిటిసి పాలూరి బోసుబాబు అన్నారు. గోకవరంలో శనివారం టిడిపి మండల అధ్యక్షుడు మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి మహాశక్తి పథక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మహిళలను కలుసుకుని మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా చంద్రబాబును, ఎంఎల్ఎగా జ్యోతుల నెహ్రూని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.భరత్, పి.ప్రసాద్, నల మహారాజు, సిహెచ్.రామకృష్ణ, కె.సత్తిబాబు, పి.బుజ్జి, పాండు, రాము, రాంబాబు, వీరబాబు, భీమరాజు, గోపిపాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో పోటీలు

ప్రజాశక్తి - చాగల్లు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో రోటరీ ఇంటర్నేషనల్ యువజన మాస ఉత్సవాల సందర్భంగా చదరంగం మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పాన్సర్, రొటేరియన్ పిచ్చెట్టి ఫణిసింహ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.వీర్రాజు, ఉపాధ్యాయలు విడి.గంగాధర్ పి.లత, పి .మోజస్, ఆర్.వరప్రసాద్, క్లబ్ సెక్రటరీ ఆకుల రాజీవ్, ట్రెజరర్ తుమ్మెద సత్తిరాజు, ప్రోగ్రాం చైర్ ఇంజె శేఖర్ పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో మాతృ, శిశు మరణాలను నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్ భరత్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, హెల్త్, శిశు మహిళా సంక్షేమం, జగనన్నకు చెబుదాం, పాఠశాల విద్య, నాడు నేడు రెండవ దశ పనులు, విక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో తదితర అంశాల పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత వివరిస్తూ జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలు, గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలతోపాటు పోషకాహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సంబంధిత అధికారులకు ప్రతి రోజు ఆదేశాలు చేస్తూ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రక్తహీనతకు సంబంధించి 10-19 మధ్య వయస్సు గల 41,035 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించగా ఇందులో 14,385 మందికి తేలికపాటి, 15,625 మందికి మోస్తారుగా 100 మందికి తీవ్రంగా రక్తహీనతను గుర్తించామన్నారు. రక్తహీనతను అధిగమించేందుకు వీరందరికీ పౌష్టికారం, మెడిషన్ అందజేస్తున్నామన్నారు. 15- 49 వయస్సు గల 6732 మంది గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి లోపాన్ని గుర్తించిన 1277 మంది గర్భిణీలకు, 5 ఏళ్లలోపు 83,572 చిన్నారులకు పరీక్షలు నిర్వహించి లోపాన్ని గుర్తించిన 1720 మంది చిన్నారులు హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు మెడిసిన్, పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 405 జెఎఎస్ శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఎంహెచ్ఓ డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, డిసిహెచ్ఒ డాక్టర్ ఎమ్.సనత్ కుమారి, సిపిఒ ముఖలింగం, బిసి వెల్ఫేర్ అధికారి రమేష్, ఎస్సి వెల్ఫేర్ అధికారి పి. సందీప్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కె. విజయ కుమారి, డిఇఒ ఎస్.అబ్రహం, డిఎల్డిఓలు వి.వీణాదేవి, శాంతామణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కానూరు అగ్రహారంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారం గ్రామంలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుల అతికాల రామకష్ణమ్మ (శ్రీను), దాసం బాపన్న నాయుడు, హనుమంతు సుబ్రమణ్యం, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు,పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఇచ్చి వివరిస్తున్న బూరుగుపల్లి

కొవ్వాడ కాలువ పూడుకతీత చేపట్టాలి

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వాడ కాలువ పూడికతీత పనులను చేపట్టాలని పలువురు రైతులు కోరారు. స్పందన కార్యక్రమంలో భీమోలు చెరువు నీరు, కొవ్వడ కాలువ వరద నీరు వచ్చి పంటలు ముంపు గురవుతున్నాయని కాలువలో పూడుకతీత చేపట్టి, వెడల్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం కొవ్వాడ కాలువ ఇరిగేషన్ ఇన్ఛార్జ్ డిఇఇ చదలవాడ భాస్కరరావు చిట్యాల శివారులో ఉన్న కొవ్వాడ కాలువ వల్ల ముంపునకు గురౌతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు హరిబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరద నీరు అత్యధికంగా వచ్చి పంటలు పాడవడంతో అప్పుల పాలవుతున్నామని తెలిపారు. ముంపు వల్ల కొందరు రైతులు పంట వేయడం లేదన్నారు. ధైర్యం చేసి పంట వేస్తే కాలువ వల్ల ముంపు అధికమై పంట నష్టపోయి అప్పులు పాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిఇఇ మాట్లాడుతూ కొవ్వడ కాలువ సుమారు 20 కిలోమీటర్ల వరకు పూడుకతీతతోపాటు, కాలువ వెడల్పు అవసరమైన భూ సేకరణ సర్వే కొరకు నివేదికను అందించినట్లు వివరించారు. ఈ పర్యటనలో రైతులు ఇంజారపు సతీష్ కుమార్, పోసిన హరిబాబు, నల్లగంటి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించండి

చాగల్లు: వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించాలని హోంమంత్రి తానేటి వనిత సూచించారు. శనివారం నెలటూరులో సీతారామ కళ్యాణమండపంలో ఎపికి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో మీకు మంచి జరిగితేనే మళ్లీ తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ధైర్యంగా అడిగిన ఏకైక సిఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ప్రభుత్వ పథకాన్ని ఇంటికే అందించేలా పాలన సాగిస్తున్న సిఎంను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు కోరాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన చందన

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పిడింగొయ్యి పంచాయతీలో సచివాలయాలు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను శనివారం నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది గ్రామ స్థాయి నుంచి ఉండాలన్నా సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని అన్నారు. గ్రామ స్థాయిలో అన్ని సేవలను అందుబాటులోకి తెచ్చేందుకే సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్బికెలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాలిక.శ్రీను, రేలంగి .వీర వెంకట సత్యనారాయణ, వేముల ఏసుబాబు, బొప్పన సుబ్బారావు, పడాల వీర రాఘవరెడ్డి, చీర రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన విజయానికి కృషి చేయాలి

సీతానగరం: రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి కృషి చేయాలని రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ఛార్జ్ బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని రఘుదేవపురంలో మండల జనసేన పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం మండల విస్త్రత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలవల నానాజీ, దూలం కష్ణ, తోలేటి బాబు అనుచరులు 300 మంది జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎనినకల్లో పవన్ కళ్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'నా సేన కోసం నా వంతు కమిటీ' కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, కారిచర్ల విజయ్ శంకర్, ఉందుర్తి ఇస్సాకు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రం తనిఖీ

బిక్కవోలు: బిక్కవోలు, బలబద్రపురం గ్రామాల్లో బాణాసంచా తయారీ కేంద్రాలను డిఎస్పి కిషోర్కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తయారీ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో సిఐ శివగణేష్, ఎస్ఐ బుజ్జిబాబు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ

దేవరపల్లి: మన సంస్కృతి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు, హిందీ ప్రతిభ పరీక్షల్లో భాష్యం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర జిల్లాస్థాయి ర్యాంకులు సాధించారు. 6వ తరగతి విద్యార్థి జుజ్జువరపు సహస్ర హిందీ ప్రతిభ పరీక్షల్లో రాష్ట్ర తృతీయ స్థానం, 10వ తరగతి విద్యార్థి అంబటి రేవంత్ జిల్లా ద్వితీయ స్థానం సాధించగా హైదరాబాద్లో జరిగిన అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ చేతుల మీదుగా జ్ఞాపిక ప్రశంస పత్రాలను అందజేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను భాష్యం జోనల్ ఇన్ఛార్జ్ జిఎన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ పేరయ్య నాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపల్ షబానా, ఉపాధ్యాయులు అభినందించారు.

పలువురిని పరామర్శించిన 'బూరుగుపల్లి'

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రులో పలువురు కుటుంబాలను మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు శనివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన వాకా నాగయ్య, మద్దింశెట్టి గంటయ్య అనారోగ్యంతో మృతి చెందగా, సుంకవల్లి సత్యనారా యణ వద్ధాప్యంతో మరణించారు. మతుల కుటుంబ సభ్యులను శేషారావు పరామర్శించి, సానుభూతిని తెలిపారు.

గ్రంథాలయానికి గడియారం బహూకరణ

చాగల్లు : స్థానిక శాఖ గ్రంథాలయానికి శనివారం బొమ్మి వెంకట దుర్గా వరప్రసాద్ వారి కుమార్తె నిహారిక జన్మదినం సందర్భంగా డిజిటల్ గడియారం బహూకరించారు. చాగల్లు శాఖ గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూన్ 'నిజం'

చంద్రబాబుపై మరో కేసు

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవం

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైతు నాయకులు ఉండవల్లి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎంపిపి పాఠశాలలో శనివారం మండల రెండో బాలోత్సవం గోడపత్రికను వ్యవసాయ శాఖ విశ్రాంత ఎడి కేశిరాజు సీతారామయ్య, బాలోత్సవ గౌరవ సలహాదారుడు నారాయణ విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతమైన దేవరపల్లిలో బాలోత్సవం నిర్వహించటం కష్టమైన బాలల బంగారు భవిత కోసం తప్పడం లేదన్నారు. అందుకు ప్రతీ ఒక్కరూ చేయి చేయి కలిపి జయప్రదం చేయాలన్నారు. మండల బాలోత్సవ అధ్యక్షులు బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థుల్లోని సజనాత్మకతను, జ్ఞాన తృష్ణను ప్రోత్సహించేందుకు బాలోత్సవం ఒక వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు యు.శంకరుడు, బాలోత్సవ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆచంట సుభాష్ చంద్రబోస్, నలమాటి రామారావు, మండల యూటిఎఫ్ సభ్యులు బి. నాగేంద్ర ప్రసాద్, కెపి. బిందు, డి. రమాజానికి, కె. ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

నర్సరీని సందర్శించిన పద్మశ్రీ చంద్రశేఖర్

పద్మశ్రీ చంద్రశేఖర్ను సత్కరిస్తున్న సత్యదేవ నర్సరీ యాజమాన్యం

ప్రజాశక్తి - కడియం

ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న సంకురాత్రి ఫౌండేషన్ అధినేత, కిరణ్ కంటి హాస్పిటల్ డాక్టర్ సంక్రాంతి చంద్రశేఖర్ శనివారం కడియపులంక శ్రీ సత్యదేవా నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ యాజమాన్యం పుల్లా ఆంజనేయులు, పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్కు సన్మానపత్రం అందజేసి చిరు సత్కారం చేశారు. పుల్లా ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశ్రీ సంక్రాంతి చంద్రశేఖర్ రాక నర్సరీకి ఎంతో ఆనందదాయకమన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ తొందరలోనే నర్సరీ రైతులందరి కోసం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన రచించిన ఆశా కిరణం పుస్తకాన్ని నర్సరీ యాజమాన్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలకంఠ మాస్టారు, బి.వెంకట్రావు, బి.సత్యనారాయణ, పిండి మూర్తి, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

71.24 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్, కిర్లంపూడి

కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామ శివారులో గంజాయి తరలిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం టాటా మ్యాజిక్ వ్యాన్‌లో జాతీయ రహదారిపై వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లే రహదారి లో బూరుగుపూడి లో దాబా వద్ద నిలిపి ఉన్న వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. అందులో 8 బ్యాగుల్లో ప్యాకెట్ల గంజాయిని గుర్తించి వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని నుంచి పల్సర్ బైకును, టాటా మ్యాజిక్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఆ పది మందిని ప్రత్తిపాడు జుడీషియల్ కోర్టుకు హాజరు పర్చామని తెలిపారు. మొత్తం వాటి విలువ రూ.15 లక్షలు ఉంటాయన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి – చాగల్లు

నిడదవోలు మండలం సూరాపురానికి చెందిన వద్దిరెడ్డి పోశియ్య రహస్యంగా చాగల్లు మండలం కలవలపల్లి గ్రామ శివారులో గంప్రోతు బూరయ్యికి చెందిన పొలంలో సారాను కాస్తుండగా పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పోశియ్యను అదుపులోకి తీసుకోవడంతోపాటు, ఒక గ్యాస్ స్టౌవ్, రెండు గ్యాస్ సిలిండర్లు, నాలుగు పాత్రలు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందుతుడిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఆటో దగ్ధం

ప్రజాశక్తి–జగ్గంపేట రూరల్

మండలంలోని వెంగయమ్మపురంలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదానికి ఆటో దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కు గ్రామానికి చెందిన మజ్జి దుర్గాప్రసాద్ ఆటో అగ్నికి ఆహుతైంది. స్థానికులు సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక వాహన ట్యాంక్ తో మంటలను పూర్తిగా అర్పడం జరిగిందన్నారు. రూ.లక్ష 20 వేలు నష్టం వాటిల్లినట్లు లక్ష్మణరావు తెలిపారు.

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

ప్రజాశక్తి–గండేపల్లి

సూరంపాలెంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2023 సందర్భంగా ఈ సంస్థ ఉద్యోగులు రామేశ్వరంపేట వరకు వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య వర్ధన్, డిజిఎం మాట్లాడుతూ అవినీతి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎవరైనా కేంద్ర ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడితే పిడిపి 'చట్టం ద్వారా సంబంధిత అధికారులకు, విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌వి.కుమార్, ఉమామహేష్, ఎన్ఎస్ఆర్ వీరేంద్ర పాల్గొన్నారు.

'సైబర్ నేరాల నియంత్రణకు శిక్షణ

ప్రజాశక్తి–పిఠాపురం

సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ క్రైమ్ ట్రైనింగ్ సిబ్బందికిస్తున్నట్లు ఏలూరు రేంజ్ డిఐజి జి విజి.అశోక్ కుమార్ అన్నారు. శనివారం పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో తో మాట్లాడుతూ ఏలూరు రేంజ్ పరిధిలో సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టాయనిఅన్నారు. జిల్లాలో సోషల్ మీడియా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డిఐజి తెలిపారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డిఐజి కాకినాడ జిల్లా ఎస్పి మొక్కలు నాటారు. డిఐజివెంట కాకినాడ జిల్లా ఎస్పి సతీష్ కుమార్, డిఎస్పి మురళీకృష్ణారెడ్డి, సిఐ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేబినేట్ ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి – గోకవరం

రాష్ట్రంలో జర్నలిస్టులకు 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర కేబినేట్ తీసుకున్న నిర్ణయం పట్ల వైసిపి ఉభయ గోదావరి జిల్లాల ఎస్‌సి సెల్ ఇన్‌ఛార్జ్ గుల్లా ఏడుకొండలు హర్షం వ్యక్తం చేశారు. స్థానికంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాదయాత్రలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు జగన్మోహన్ రెడ్డి కేబినేట్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపడం చారిత్రాత్మకమని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

ప్రజాశక్తి – గోపాలపురం

ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక జాతీయ రహదారి 516 డి రోడ్డులో ప్రమాదాలు జరిగే జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రేడియం గేట్లను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ వాహనాల అతివేగాన్ని నియంత్రించేందుకు జంక్షన్ల వద్ద గేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు ముందుగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, జాగ్రత్తగా అప్రమత్తంగా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నేషనల్ హైవే రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేయరాదని, ఎప్పటికప్పుడు నీళ్లతో మొహం శుభ్రపరచుకుని భారీ వాహనాల నడపాలని సూచించారు.

అర్హత కలిగిన అందరికీ ఓటు

ప్రజాశక్తి – గోపాలపురం

అర్హత కల్గిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కల్గివుండాలని ఇఆర్ఒ ఎం.వెంకట సుధాకర్ అన్నారు. శనివారం గోపాలపురం హైస్కూల్ వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బిఎల్ఒలతో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల నుంచి ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని అన్నారు. ఓటర్ కార్డులో తప్పులను సరి చేసుకునేందుకు, ఆధార్ అనుసంధానం కొరకు 4. 5 తేదీల్లో ప్రత్యేకంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కమ్ముకొచ్చిన కరువు



ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో కరువు మేఘాలు కమ్మేయటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వర్షాభావం నెలకొంది. జిల్లాలోనూ జగ్గంపేట, తాళ్లరేవు, గోకవరం, బిక్కవోలు తదితర మండలాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో బోర్ల ద్వారా శివారు రైతులు మోటారు ఇంజిన్ల ద్వారా పంటకు తడులు అందిస్తున్నారు. సాగు ఖర్చులకు డీజిల్ ఖర్చులు అదనపు భారంగా మారాయి. గతేడాది అకాల వర్షాలతో అన్నదాత పూర్తిగా నష్టపోయిన విషయం విదితమే. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటి కాల్వల ఆధునీకరణ చేయకపోవటం, ఎత్తిపోతల పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోవటం రైతుల పాలిట శాపంలా మారింది. చాగల్నాడు పథకం కింద 35 వేల ఎకరాలు ఉన్నప్పటికీ కేవలం 8 వేల ఎకరాలకే నీరందుతోంది. తాళ్లరేవు మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు మోటారు ఇంజిన్ల పొలాలకు నీరందిస్తున్నారు. ఏటా గోదావరి నుంచి లక్షల క్యూసెక్కుల నీరు సముంద్రలోకి వదిలేస్తున్నారు. గోదావరి నదిలో డ్రెడ్జింగ్ చేపట్టి రిజర్వాయర్ సామర్థ్యం కాపాడే అవకాశాలున్నా ఆ దిశగా అడుగులు పడటంలేదు. మరో వైపు కాలువలు ఆధునీకరణ, మీడియం, మైనర్ మేజర్ డ్రైన్లలో పూడిక తీత వంటి పనులపై నిర్లక్ష్యం వెంటాడుతోంది. నిధులు కేటాయించకపోవటంతో కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావటంలేదు. ఫలితంగా ఒకప్పుడు అన్నపూర్ణగా పిలవడిన జిల్లాలోనూ సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కరువు మండలాల ఎంపిక జరిగిన విషయం విదితమే. అయితే ఈ జాబితాలో చోట్లు దక్కితే రైతులకు కొంత ఊరట లభించే అవకాశం ఉన్నా యంత్రాంగం ఆ దిశగా చొరవ లోపించింది.

కొండెక్కిన కూరగాయల ధరలు

కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. దసరా, దీపావళి పండుగలతో పాటు కార్తీక మాసం రాకతో ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విదితమే. ఉల్లి ధర కేజీ రూ.80 చేరటంతో కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది. గత నెల ప్రారంభంలో నేలను తాకిన టమోటా ధరలు మళ్లీ క్రమ క్రమంగా పెరిగాయి. కేజీ రూ.50కి చేరాయి. కిలో మిర్చి రూ.80 చొప్పున జరుగుతున్న విక్రయాలు కొనుగోలు దారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వంకాయ, బెండ, గోరు చిక్కుళ్లు, కేరట్, బంగాళదుంప తదితర రకాలు కేజీ రూ.50 పైమాటే. తీగ చిక్కుళ్లు కిలో రూ.100 మార్కు దిగిరానంటున్నాయి. ఆకు కూరలు సైతం ధరలు ఆమాంతంగా పెరిగాయి. రైతు బజార్లలో కూరగాయల నాణ్యత లేమి వెంటాడుతోంది. నాణ్యమైన కూరగాయలు హోటళ్లకు పోతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి నాణ్యమైన కూరగాయలు అందించేందుకు కృషి చేయటంతో పాటు రైతు బజార్లలో సబ్సీడీ ఉల్లిపాయలు అందించేందుకు చొరవ చూపించాలని కొనుగోలు దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై ప్రజా రక్షణ భేరి

ప్రజా సమస్యలపై సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి యాత్ర సోమవారం జిల్లాకు రానుంది. 2019లో వైసిపి అధినేతగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన విషయం విదితమే. గడిచిన నాలుగున్నరేళ్లలో అనేక హామీలు ఆచరణలో అమలుకు నోచుకేలేదు. మరో వైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పన్నులు, విద్యుత్ ఛార్జీల భారాలు సామాన్యులకు కంటిమీద కునుకు కరువైంది. దీనిపై వామపక్ష పార్టీలు నిరంతరం ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. ప్రధాన ప్రతిపక్ష మైన తెలుగుదేశం పార్టీ సైతం కేంద్రంలోని బిజేపీకి మద్దతు తెలుపుతూ ప్రజా సమస్యలను విస్మరించింది. ప్రజలలో చైతన్యం నింపేందుకు ఆ పార్టీ నడుం బిగించింది. ఈ నేపథ్యంలో సోమవారం మహాసభను నిర్వహించనుంది.

తెలుగుదేశం పార్టీలో జోష్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు బెయిల్ రావటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొది. జిల్లాలోను సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. తాజాగా షరతులతో కూడిన బెయిల్ రావటంతో విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును కలిసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలి రావడం, విజయవాడ వరకూ కాన్వాయ్ వెంట నడవడంతో మరింత ఉత్సాహాన్ని నింపింది.

యానాం వార్తలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాట్ల దేవదానం రాజు, డాక్టర్ వరుగు భాస్కర్ రెడ్డి

వందే విశ్వమాతరమ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి–యానాం

స్థానిక ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాలలో వందే విశ్వ మాతరమ్ పోస్టరును ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు, ప్రిన్సిపల్ డా.వరుగు భాస్కరరెడ్డి, అధ్యాపకులు సుధాకర్, రమేష్, శ్రీనివాస్, విజయసాగర్, విష్ణుమూర్తి ఆవిష్కరించారు. శతశతక కర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ 100 దేశాల్లో శాంతి, సద్భావనా యాత్ర 2023–2025 ఉత్తర అమెరికా తెలుగుసంఘం, దేశంలో వందకు పైగా తెలుగు సంఘాల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న మహా అక్షర యజ్ఞం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు.

రీజెన్సీ స్కూల్లో విద్య వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి–యానాం

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించే లక్ష్యంతో స్థానిక రీజెన్సీ స్కూల్లో విద్య వైజ్ఞానిక ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయులు టివిఎస్ఎస్ వి.ప్రసాదరావు ప్రారంభించారు. విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా 140 అంశాలను ప్రదర్శించారు. దానిలో ప్రైమరీ 92, మిడిల్ 40, హైస్కూల్ 8 అంశాలున్నాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కళాశాల అధ్యాపకులు పి.బాలాజీ, ఎం.సతీష్ కుమార్, పుష్పకుమారి, పివి.వరలక్ష్మి, రహీమ, సిహెచ్. అశ్వని, కె.క్రాంతి కుమార్, ఉషా రామలక్ష్మి వ్యవహరించారు.

రైతు సదస్సును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి – పెద్దాపురం

ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు సదస్సు రెండో రోజు శనివారం రైతులకు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. రైతుల ప్రయోజనాల కోసం, అధిక దిగుబడుల ద్వారా అధికాదాయం పొందేందుకు రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకట నరసింహారావు జీవ నియంత్రణ విధానాలపై, డాక్టర్ వి.సుజాత మొక్కజొన్న సాగు విధానాలపై, డాక్టర్ ఎఎస్ఆర్.శర్మ ప్రత్తిలో సస్యరక్షణపై, డాక్టర్ ఐ.సుధీర్ కుమార్ అపరాల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆరోగ్య సురక్షతో కార్పోరేట్ వైద్యం

సురక్ష కిట్లు అందిస్తున్న చైర్‌పర్సన్

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

సామర్లకోట బలుసులపేట ఎస్టిజికె మున్సిపల్ పాఠశాల ఆవరణలో శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేదలకు పూర్తి ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా ఉపయోగించు కావాలన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్ నేతల హరిబాబు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణపై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న సంతోషకుమారి

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్, న్యాయవాది జంగం సంతోష కుమారి పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బాలల హక్కులు, పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ఎంఇఒ శివరామకృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషకుమారి మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి, లైంగిక వేధింపులపై వివరించారు. బాలలు అత్యవసర పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో పిల్లల రక్షణ కోసం 1098 ఉచిత ఫోన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.వాణీ ప్రభ, కౌన్సిలర్ పాలికి కుసుమ చంటిబాబు పాల్గొన్నారు.

సూర్యచంద్రకు పలువురి మద్దతు

ప్రజాశక్తి – జగ్గంపేట రూరల్

మండలంలోని పంటలు నష్టపోయిన రైతులకు నష్టరిహారం ఇవ్వాలని రాజపూడిలో దీక్ష చేస్తున్న జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాఠంశెట్టి సూర్యచంద్రకు శనివారం పలువురు మద్దతు తెలిపారు. టిడిపి నాయకుడు పైల సుభాష్ చంద్రబోస్, బిసివై పార్టీ ఇన్‌ఛార్జి అనూష యాదవ్, ఏపూరి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

ఆర్‌పిఎల్ వేలం ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపి మార్గాని

యువత క్రీడలపై మక్కువ చూపాలి

ఆర్‌పిఎల్ వేలం నిర్వాహణ సభలో ఎంపి భరత్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలంటే యువత క్రీడలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపి మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్(ఆర్‌పిఎల్) క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే క్రీడాకారుల వేలం కార్యక్రమం ఎపిఇపిడిసిఎల్ ఇంజనీరింగ్ గెస్ట్ హౌస్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన వేలం ప్రారంభోత్సవ సభలో ఎంపి మార్గాని భరత్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐపిఎల్ స్థాయిలో రాజమహేంద్రవరం కేంద్రంగా నిర్వహిస్తున్న ఆర్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంటు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆర్‌పిఎల్ చైర్మన్ అజ్జరపు వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంచె శేఖర్‌లు గత ఆరేళ్లుగా క్రమం తప్పకుండా ఈ టోర్నమెంటును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాజమహేంద్రవరం నగరం పర్యాటక ప్రాంతంగా అభివద్ధి జరుగుతుందని, క్రీడలపరంగా రాజమహేంద్రవరం నగరానికి మంచి గర్తింపు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంను నిర్మించాలని తలంచానని, ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్మించేందుకు చేసిన ప్రయత్నాలకు కొన్ని అడ్డంకులు రావడంతో ఫలించలేదన్నారు. రాబోయే ఎన్నికల నాటికి నాగులచెరువు ప్రాంతంలోని స్టేడియంలో గ్రీన్ కార్పెట్ గ్రౌండ్‌గా తీర్చిదిద్దడంతోపాటు, ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే పోలీసు గ్రౌండ్‌లో ఇప్పటికే గ్రీన్ కార్పెట్‌గా తీర్చిదిద్దారని, ఎంపి నిధులు ఒక కోటి రూపాయలతో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 400 మంది క్రీడాకారులు, సుమారు 20 జట్లుతో ఈ టోర్నమెంటు సాగనుందని ఆర్‌పిఎల్ చైర్మన్ అజ్జరపు వాసు తెలిపారు. తాను ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో తన స్నేహితులే ప్రధాన భూమిక పోషిస్తారని, ఎంపి మార్గాని భరత్ రామ్ అందిస్తున్న సహకారం తమ కార్యక్రమాలకు మరింత ఊతంగా నిలుస్తున్నాయని అన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ మానసిక ఉల్లాసం..శారీరక దారుఢ్యంకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మానె దొరబాబు, చంటి, కుంచె శేఖర్, మణికంఠరెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత ప్రవీణ్‌కు అభినందన

ప్రజాశక్తి–అమలాపురం రూరల్

డొక్కా సీతమ్మ ఇన్స్‌స్పిరేషనల్ నేషనల్ అవార్డ్ గ్రహీత, ఆంధ్ర సేవారత్న కరాటం ప్రవీణ్ కు గవర్నర్ నజీర్,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పి శ్రీధర్, జెసి ఎస్ఎన్.అజయ్, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపి చింతా అనూరాధ, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, సూర్యనారాయణ రావు, ఇజ్రాయిల్ శనివారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ దంపతులకు వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల అధినేత కె.నరసింహారావు, ప్రిన్సిపల్ కె .మనోహర్ తదితరులు ఘనంగా సన్మానం చేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోలా మణి రుద్ర, జెడ్‌పిటిసి సభ్యుడు పి.హరి, ఎంపిపి కె.భాగ్యలక్ష్మి, చైర్మన్ కె.సత్య శైలజ, తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి–రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో పామర్రుకు చెందిన నేతల చిరంజీవి, కూళ్లకు చెందిన అంబంటి రాంప్రసాద్ ఇటీవల మరణించారు. శనివారం మృతుల కుటుంబ సభ్యులను పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా డొక్కా సీతమ్మ ఆసరా పథకం తరపున ట్రస్ట్ చైర్మెన్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలిశెట్టి శ్రీను, జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ నియోజకవర్గం ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ పనుల పరిశీలన

ప్రజాశక్తి–మండపేట

అర్తమూరు గ్రామంలో ఆర్‌డిఎస్ఎస్ నిధులు రూ.20లక్షలతో జరుగుతున్న త్రీఫేజ్ విద్యుత్ పనులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు శనివారం పరిశీలించారు. ఆయన వెంట వైసిపి నాయకులు కురుపూడి రాంబాబు, పలివెల సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి–రాజోలు

ప్రజా సమస్యలు పరిష్కారించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని ఎంపిపి కేతా శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజోలు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భగా మండలంలోని పలు గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. పలు సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిడిఒ ఎన్. బాలాజీ మాట్లాడుతూ గ్రామాల్లోకి జరిగే అభివద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని తమ దష్టికి వచ్చిందని అన్నారు. అలాంటి అధికారుల కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో తాటిపాక మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి, తహశీల్దార్ ఎమ్.ముక్తేశ్వర రావు తదితరులు పాల్గొనారు.

మార్కెట్ కమిటీ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి–ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తంలో నిర్మాణంలో ఉన్న మార్కెట్ కమిటీ యార్డ్‌ను ఎఎంసి చైర్మన్ దంగేటి డోలామణి శనివారం పరిశీలించారు. రైతుల ప్రయోజనార్ధం గత టిడిపి ప్రభుత్వంలో ఈ భవన నిర్మాణం చేపట్టగా గత కొన్నేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. స్థానిక సర్పంచ్,సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలయ్యలు ఈ విషయాన్ని ఎఎంసి చైర్మన్ డోలామణి దష్టికి తీసుకు వెళ్లారు. పరిశీలించిన వారిలో ఎఎంసి డైరెక్టర్లు చప్పిడి దుర్గారావు, నిమ్మకాయల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి–ఉప్పలగుప్తం

అర్హులైన ప్రతి పేదవాడి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్ కు దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. విలసవిల్లిలో శనివారం సర్పంచ్ సలాది ఊర్మిళదేవి అధ్యక్షతన ఎంపిడిఒ కెవి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ ఆయన తనయుడు డాక్టర్ శ్రీకాంత్ లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎఎంసి చైర్మన్ దంగేటి డోలామణి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి–ఉప్పలగుప్తం

గోపవరం, సరిపల్లి గ్రామాలలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మాజీ ఎంఎల్‌ఎ, అమలాపురం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు, ఆనందరావు పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. ఆనందరావు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారాన్ని చేపట్టిన సిఎం జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని జగన్ కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆరిగెల నానాజీ, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, లింగంపర్తి గ్రామ కాపురస్తురాలు ఎద్దు మరియ, తండ్రి: సూర్యారావు అను నాయొక్క పాస్‌పోర్టు నెంబర్ **X0960978** ది. 11-09-2023వ తేదీన లింగంపర్తి గ్రామం నుండి ఏలేశ్వరం జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో నాయొక్క పాస్‌పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికినవారు నాకు తెలియజేయగలరు.

ఎద్దు మరియ
తండ్రి: సూర్యారావు, లింగంపర్తి గ్రామం ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా.
సెల్: 78933 59360

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 6/2021

Between:
Shaik Gouse ***...Petitioner***
AND
1) Patsamatla Ramana Murthy, S/o. Rama Krishnam Raju, Hindu, Business, age 55 years, D.No. 1-4-1/2, Ward No. 23, Vanacharla Vari Street, Savaram Road, Amalapuram, Dr.B.R.Ambedkar Konaseema Dist.
2) Patsamatla Sree Subrahmanya Rajeswari, D/o. Ramana Murthy, Hindu, Inam, age 26 years, D.No. 1-4-1/2, Ward No. 23, Vanacharla Vari Street, Savaram Road, Amalapuram, Dr.B.R.Ambedkar Konaseema Dist.
...Respondents

ఈ నెంబరు పై రెస్పాండెంట్స్‌ను Insolvent గా డిక్లేర్ చేయమని కోరుతూ ఈ IP దాఖలు చేసినారు. సదరు IPలో కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనుట లేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం యీ పబ్లికేషన్ ద్వారా **ది.07-11-2023 సం॥రం తేదీన వాయిదా అని తెలియచేయడమైనవి.** కావున మీ ఇరువురు వాయిదా తేదీ ఉదయం 10:30 గం॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలుపవలెను. లేనిచో మీ పరోక్షమందు విచారించి తార్మానించబడునని యిందు మూలంగా మీకు తెలియచేమడమైనది.

వాయిదా తేదీ : *07-11-2023*
చింతపల్లి అజయ్ కుమార్, అడ్వకేట్, అమలాపురం. సెల్: 98498 64699

SUR NAME CHANGE

I, Boppana Swetha D/o Boppana Pulla Rao R/o D.No 3-140, Main Road, Opp Lutheran Church, Hukumpeta, Rajahmundry Rural, East Godavari District, Andhra Pradesh, India, have changed my name from Eedala Swetha to Boppana Swetha an vide affidavit dated 27-10-2023 before Notary.

ప్రకటన

నా క్లయింటు అంబాజీపేట మండలం, అంబాజీపేట గ్రామ కాపురస్తులు **సరేళ్ళ మీరా సాహెబ్ గారి కుమారుడు రవికుమార్** గారి సంజాయిషీ పై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటుకు గిఫ్ట్ శెటిల్‌మెంటు దస్తావేజు ది.21-07-2023 **దాక్యుమెంటు నెం. 2590/2023** రీత్యా ఆర్.ఎస్.నెం. 138/3లో య.0-11సెంట్లు అనగా 536 చదరపు గజాల స్థలం మరియు రేకుల షెడ్డు డో.నెం. 12-342 ముత్తాబత్తుల బాల మంగతాయారు వగైరాల ద్వారా సంక్రమించినది. దాని లింకు దస్తావేజు పార్టీషన్ దస్తావేజు ది.16-02-2005వ తేదీ **దాక్యుమెంటు నెం. 246/2005** ఒరిజినల్ దస్తావేజు కనిపించుట లేదు. నా క్లయింటు హిరనందిని ఫైనాన్స్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచ్ ద్వారా లోన్ తీసుకొను చున్నారని తెలియ చేయడమైనది. సదరు లింకు డాక్యుమెంటు ఎవరికైనా కనిపించిన ఎడల మరియు సదరు ఆస్థిపై అనగా **గిఫ్ట్ దస్తావేజు నెం. 2590/2023** ఎవరికైనా అభ్యంతరం ఉన్న ఎడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజుల లోగా లిఖిత పూర్వకంగా ఈ క్రింది ఉదహరించిన వారికి తెలియజేయవలెను. లేని ఎడల సదరు ఆస్థిపై ఎటువంటి అభ్యంతరములు లేవని పరిగణించబడును.

టి.శాంతి కమల
అడ్వకేట్, అమలాపురం. సెల్: 70136 65313

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 241/2021

Between:
Sirigina Venkata Rama Rao, S/o. Venkata Rao, aged 52 years, Hindu, Male, D.No. 5-213, Velivennu (V), Undrajavaram Mandal, E.G.Dt., ***...Plaintiff***
AND
Kollamsetti Venkata Durga Rao, S/o. Balakrishna Murthy, age 48 years, Hindu, Male, D.No. 4-112, Munipalli (V), Nidadavole Mandal, E.G.Dt., ***...Defendant***

వాది తరపున వేయించిన ప్రకటన

యిందుమూలముగా ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, పై నంబరులో శ్రీ కోర్టు ద్వారా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో దావా విచారించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
తణుకు **టి.నెహ్రూ**
ది.05-11-2023 వాది తరపు అడ్వకేటు

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి పిఠాపురం వారి కోర్టునందు
ఐ.పి.నెం. 4/2021

బిట్వీన్:
పెనుముచ్చు వెంకట నాగేశ్వరరావు, తండ్రి: రంగయ్య, 39 సం॥లు, డో.నెం. 1-32, R/o. ఎల్.డి.పేట గ్రామం, కోటనందూరు మండలం, తూర్పు గోదావరి జిల్లా. ***...పిటీషనరు***
సీ.నెం.
15) రామిశెట్టి శివాజి, తండ్రి: సత్తిబాబు, మాసాహేబ్ పేట గ్రామం, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా.
22) గంటా వీరబాబు, తండ్రి: రాంబాబు, మాసాహేబ్ పేట గ్రామం, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా.
23) ఊటా భవాని, శ్రీనివాస థియేటర్ ఎదురుగా, రాజావ్ గృహ కల్పన ఎదురుగా, తుని, కాకినాడ జిల్లా.

ఇందుమూలముగా పై రెస్పాండెంట్సుకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పై క్లయింటు పిటీషను ఐ.పి.4/2021లో పిటీషనరు ఇన్‌సాల్వెంటుగా డిక్లేరు చేయమని పై కోర్టు వార్ని కోరుచూ పిటీషనరు పిటీషను దాఖలు చేసినారు. సదరు పై పిటీషనరు నందు రెస్పాండెంట్సు వారికి ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ది.06-11-2023వ తేదీన పై కోర్టు వారి ముందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తన అభ్యంతరములు చేసుకొనవలెనని పిటీషనరు పేపరుతో జనరల పబ్లికేషన్ వేయించి ఉన్నారు. అయినప్పటికీ మీరు కోర్టుకు హాజరు కానందున మరియు ఎన్నిసార్లు నోటీసులు పంపిఉన్నప్పటికీ వాటిని తీసుకోకుండా కాలయాపన చేసియున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన చేయడమయినది. పై రెస్పాండెంట్లు **ది.06-11-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ముందు హాజరయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకోవలెను.** లేనిచో పై కోర్టు వారు పిటీషను పై క్లయింటును పబ్లిక్ సమక్షమున తీర్మానించెదరని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం నోటీసు జారీ చేయడమైనది)

మేడిద గణేష్
పిటీషనరు తరుపు న్యాయవాది,
పిఠాపురం. సెల్: 83091 66459